సాక్షి శ్రీకాకుళం

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



రక్షా కవచం

ఫోన్లలో డేటా మనకు తెలియకుండానే చోరుల చేతుల్లోకి వెళ్తోంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు దిశ సైబర్ రక్షా కవచ్ ఉపయోగపడుతుంది. - 8లో



అన్నదమ్ముల ఇళ్లల్లో చోరీ

జిల్లా కేంద్రంలో అన్నదమ్ముల ఇళ్లల్లో చోరీ జరిగింది. ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. - 8లో

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ ఫెయిలైన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం చెప్పారు. అర్హత, విద్యార్థుల సంఖ్య వంటివి అధికారులతో చర్చించి ఫీజు చెల్లింపునకు నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. విద్యార్థులకు సమయం వృథాకాకుండా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోకుండా ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగులు సీట్లకు అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రవేశం పొందే విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు వర్తించవు. పూర్తిస్థాయి ఫీజును విద్యార్థులే చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్, శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్, సీతంపేట మోడల్ పాలిటెక్నిక్(ఎస్టీ) కళాశాలలతో పాటు ఐతం, శ్రీవేంకటేశ్వరా, శివానీ, నారాయణ, టీవీఆర్ ప్రైవేట్ కాలేజీలు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో ఖాళీ సీట్లు ఎక్కువగా ఉన్నా ప్రభుత్వ కాలేజీల్లో మాత్రం పరిమితంగానే ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్ల నిర్వహణలో పాలిసెట్ రాసిన విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రవేశాల సమన్వయకర్త, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు చెప్పారు.

700 మంది దాటితే ప్రత్యేక పోలింగ్ కేంద్రం



మాట్లాడుతున్న డీఆర్వో గణపతి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న, 700 మంది ఓటర్లకు పైబడి ఉండే అపార్టుమెంట్లలో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి తెలిపారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 22 నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతినిధుల సలహాలు, సూచనలు పరిశీలిస్తామన్నారు. సమావేశంలో నాయకులు రౌతు శంకరరావు(వైఎస్సార్ సీపీ), పి.ఎం.జె.బాబు(టీడీపీ), చల్లా వెంకటేశ్వరరావు(బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

ఇక క్యూలైన్లలోనే కొబ్బరికాయల మొక్కులు



కొబ్బరికాయలు కొడుతున్న పాలకమండలి సభ్యులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో కొబ్బరికాయలను కొట్టే స్థలాన్ని మార్చుతూ అధికారులు నిర్ణయించారు. ఆలయ రాజగోపురానికి ఆనుకుని ఉన్న ఉచిత దర్శనాల క్యూలైన్ల వద్దనే ప్రత్యేకంగా కొబ్బరికాయలు కొట్టేలా గ్రానైట్ పలకలతో ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియను బుధవారం ఆలయ పాలకమండలి సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో వి.హరి సూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధ, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి, లుకలాపు గోవిందరావు, జె.శ్రీనివాస్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

విద్యా వికాసానికి సీఎస్‌సీతో ఒప్పందం

టెక్కలి: విద్యార్థుల్లో విద్యా వికాసం పెంపొందించేందుకు సీఎస్‌సీ గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం సంస్థ ప్రతినిధులతో ఒప్పంద పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ ద్వారా కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వై.రామ్మోహన్‌రావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ల్యూక్‌పాల్, ఝాన్సీరాణి, ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న ప్రిన్సిపాల్, ప్రతినిధులు

హోల్ సేల్ రాతల ఉత్తరాల ఉద్యమం




ఈ ఫొటో ఒకసారిచూడండి. ఇందులో ఉన్న వ్యక్తి సారవకోట మండల టీడీపీ నాయకుడు కత్తిరి వెంకటరమణ. నరసన్నపేట టీడీపీ ఆఫీస్ నుంచి బల్క్‌గానే కార్డులు తీసుకెళ్లి పోస్టు కార్డు ఉద్యమం చేశారు.

నరసన్నపేట టీడీపీ నిరసన శిబిరంలో ముందు వరసలో నాయకులను చూడండి. పోస్టుకార్డుల కట్ట పట్టుకుని ఒకే దఫా రాసేస్తున్నారు. బల్క్‌లో కొనుగోలు చేసి బల్క్‌గానే రాసేశారు.



కాశీబుగ్గ కేసీ రోడ్డులో నిర్వహించిన టీడీపీ శిబిరంలో కొనసాగిన తంతుచూడండి. జేబులో పోస్టుకార్డుల కట్ట పెట్టుకుని, చేతిలో మరో పోస్టు కార్డుల కట్ట పట్టుకుని ఒకే చోట టీడీపీ నాయకులు రాస్తున్న సందర్భమిది.





- చంద్రబాబుకు మద్దతుగా ఉత్తరాలు రాసి పంపించాలని అధిష్టానం పిలుపు
- ప్రజలతో పాటు టీడీపీ కార్యకర్తల నుంచి కూడా స్పందన కరువు
- దిక్కు లేక పోస్టుకార్డులను బల్క్‌గా కొనుగోలు చేస్తున్న నాయకులు
- ఒకే దుస్తూరితో ఒకేసారి పోస్ట్ చేస్తున్న వైనం
- నవ్వుకుంటున్న జనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన చంద్రబాబునాయుడుకు మద్దతుగా టీడీపీ అధిష్టానం పిలుపుమేరకు చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమం జిల్లాలో అపహాస్యం పాలవుతోంది. టీడీపీ కీలక నాయకులు బల్క్‌లో పోస్టు కార్డులు కొనుగోలు చేసి వాటిని నిరసన శిబిరాల వద్ద పెట్టి, ఇద్దరు ముగ్గురు వ్యక్తుల చేత రాయించేసి, వాటినే పోస్టు చేయిస్తున్నారు. జైల్లో క్షేమంగా ఉండాలని కోరుతూ 'మీతోనే మేము' పేరుతో పోస్టు కార్డుల ఉద్యమానికి టీడీపీ అధిష్టానం పిలుపు ఇస్తే... నాయకులే ఒకచోట కూర్చొని కట్టలు కట్టల పోస్టుకార్డులు రాసేస్తుండటం చూసి జనమే నవ్వుకుంటున్నారు. కళ్లముందు జరుగుతున్న తంతు చూసి ఈ రకమైన పోస్టు కార్డు ఉద్యమం ఎప్పుడూ చూడలేదని అంటున్నారు. చంద్రబాబు అరెస్టుపై ప్రజలే స్పందిస్తూ... సెంట్రల్ జైలుకు ఈ కార్డులు రాయాలన్నది పార్టీ ఉద్దేశం. దీని ద్వారా ప్రజాభిప్రాయం తెలియాలన్నది టీడీపీ పబ్లిసిటీ ఎత్తుగడ. అయితే, దీనికి ప్రజల నుంచే కాదు టీడీపీ కార్యకర్తల నుంచి కూడా స్పందన లేకపోవడంతో నాయకులే లీడ్ తీసుకుని పోస్టుకార్డుల ఫేక్ ఉద్యమం చేస్తున్నారు.

కనీస మద్దతు కరువు..

చంద్రబాబు అరెస్టయి జైలుకెళ్లాక తొలుత నిరసన ప్రదర్శనలు అన్నారు. తర్వాత బంద్‌కు పిలుపునిచ్చారు. తదుపరి రిలే నిరాహార దీక్షలకు దిగారు. తర్వాత దేవాలయాల్లో పూజలు అన్నారు. ఇందులో ఏ ఒక్కదానికి జనం నుంచి స్పందన రాలేదు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్న పరిస్థితి లేదు. కనీసం మద్దతిచ్చి సానుభూతి కూడా చూపడం లేదు. చెప్పాలంటే చంద్రబాబు జైలుకెళ్లడాన్ని ప్రజలెవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. అవినీతి చేసినందున అరెస్టయ్యారని అంతా అనుకుంటున్నారు. అక్రమాలు చేసి ఇన్నాళ్లు తప్పించుకున్న చంద్రబాబుకు ఎట్టకేలకు పాపం పండిందని, యువతకు శిక్షణ పేరుతో వందల కోట్లు దోపిడీ చేసినందుకు తగిన శాస్తి జరిగిందని అనుకుంటున్నారు. చంద్రబాబు అరెస్టుతో సానుభూతి వస్తుందని ఆశించిన టీడీపీ నాయకులకు మైండ్ బ్లాక్ అయింది.

ఎన్ని జిమ్మిక్కులు చేసినా..

ప్రజల నుంచి స్పందన లేదని వదిలేస్తే పార్టీ ఉనికికే ప్రమాదమని టీడీపీ అధిష్టానం రకరకాల జిమ్మిక్కులు చేస్తోంది. ఏదో ఒక నిరసన కార్యక్రమం చేస్తున్నట్టు భ్రమలు కల్పిస్తూనే మరో వైపు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టాలని కేడర్‌కు ఎప్పటికప్పుడు డైరెక్షన్ ఇస్తోంది. ఒక్కొక్క నియోజకవర్గానికి 5వేల నుంచి 10వేల పోస్టు కార్డులు రాజమండ్రి సెంట్రల్ జైలుకెళ్లేలా లక్ష్యాలను నిర్దేశించింది. కొన్ని నియోజకవర్గాల్లో రెండు మూడు నాయకత్వాలు వేర్వేరుగా పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టాలని సూచించింది. ఈ లెక్కన జిల్లాలో 60 వేల నుంచి లక్ష వరకు పోస్టు కార్డులను 'మీతోనే మేము' అని ప్రజల చేత రాసి పంపించి, ప్రజా మద్దతు చంద్రబాబుకు ఉందని చెప్పడానికి ప్రయత్నించింది. రెండు వారాలుగా ఈ కార్యక్రమం జరుపుతూనే ఉంది. అయితే, పోస్టుకార్డు ఉద్యమంలో ప్రజలు పాల్గొనడం లేదు. స్వచ్ఛందంగా పోస్టుకార్డులు రాసి పంపించడం లేదు. దీంతో నాయకులే బల్క్‌లో పోస్టుకార్డులు కొనుగోలు చేసి వాటిని నిరసన శిబిరాలు, పార్టీ కార్యాలయాలు, ఇళ్లల్లో పెట్టి ఇద్దరు ముగ్గురు వ్యక్తుల చేత రాయిస్తున్నారు. కార్డులన్నింటినీ బల్క్‌గాతీసుకెళ్లి పోస్టు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో నడుస్తున్న ఏ టీడీపీ శిబిరానికి వెళ్లినా ఇదే కనిపిస్తోంది.

మాకెందుకులే..

నిరసనలు, ఆందోళనలకు కేడర్ నుంచి కనీస స్పందన లేదు. కనీసం పెద్దగా శ్రమలేని పోస్టు కార్డు ఉద్యమంలో కూడా కార్యకర్తలు పాల్గొనడం లేదు. దీనికి జిల్లాలో అమ్మకాలు జరిగిన పోస్టు కార్డుల సంఖ్యనే ప్రత్యక్ష సాక్ష్యంగా చెప్పవచ్చు. జిల్లాలో ప్రతి నెలా సరాసరి 3వేల కార్డుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. టీడీపీ అధిష్టానం పిలుపు మేరకు పోస్టు కార్డుల ఉద్యమం జరిగితే లక్షల్లో విక్రయాలు జరగాలి. కానీ, సెప్టెంబర్‌లో ఇప్పటివరకు 28 వేల కార్డులు మాత్రమే అమ్ముడయ్యాయి. అవి కూడా నియోజకవర్గానికి ఒక నాయకుడు చొప్పున బల్క్‌లో కొనుగోలు చేసినవే. వాటినే శిబిరాల వద్ద, పార్టీ కార్యాలయాల వద్ద పెట్టి ఇద్దరు ముగ్గురు రాసేస్తున్నారు. గ్రామాల వారీగా అడ్రసుల సేకరణ బాధ్యత ఇద్దరు ముగ్గురికి అప్పగించి వారి ద్వారా పేర్లను తీసుకుని, ఆ పేర్లపై పోస్టు కార్డులు రాసేసి సెంట్రల్ జైల్‌కు పంపిస్తున్నారు. బల్క్‌గా రాసిన పోస్టుకార్డులను చూస్తే దాదాపు ఒకే దస్తూరీ కన్పిస్తోంది. దీన్నిబట్టి చూస్తుంటే ప్రజల నుంచే కాకుండా పార్టీ కార్యకర్తలు కూడా పోస్టుకార్డు ఉద్యమంపై ఆసక్తి చూపడం లేదని స్పష్టమవుతోంది.

పోర్టు రైల్వేలైన్‌కు భూముల పరిశీలన

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంలో ముఖ్యమైన రైల్వేలైన్‌కు విడుదలైన నోటిఫికేషన్‌లోని భూములను బుధవారం జాయింట్ కలెక్టర్ నవీన్‌కుమార్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ పరిశీలించారు. కూర్మనాథపురం, కోటపాడు పరిధిలో రైల్వే లైన్‌కు అవసరమైన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన రైల్వే లైన్ నుంచి పోర్టుకు అనుసంధానించే రైలు మార్గం, జంక్షన్‌ను పరిశీలించారు. రెవెన్యూ సర్వే అధికారులు మ్యాప్ ద్వారా రైల్వే లైన్‌కు సేకరించబోయే భూముల వివరాలను వివరించారు. అనంతరం నౌపడలో ఆర్ అండ్‌ఆర్ కాలనీ ఎర్త్ ఫిల్లింగ్ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని పోర్టు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చలమయ్య, పలువురు సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



రైల్వే లైన్ నిర్మించనున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్

వారం రోజుల్లో తుది నిర్ణయం..

టెక్కలి: టెక్కలి మీదుగా మూలపేట పోర్టు వరకు వేయనున్న అప్రోచ్ రోడ్డుకు సంబంధించి భూములిచ్చే విషయంలో వారం రోజుల్లో తుది నిర్ణయం వెల్లడిస్తామని, అప్పటి వరకు గడువు ఇవ్వాలని మోదుగువలస, బన్నువాడ, వేములవాడ రైతులు కోరారు. బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోర్టు రోడ్డు నిర్వాసిత రైతులతో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సమావేశం నిర్వహించారు. పోర్టు రోడ్డుకు సంబంధించి రైతులు భూములిచ్చేందుకు పూర్తిస్థాయిలో అంగీకారం తెలిపారని, మిగిలిన మోదుగువలస, బన్నువాడ, వేములవాడ గ్రామాలకు చెందిన రైతులు కూడా అభిప్రాయం తెలియజేయాలన్నారు. మరో వారం రోజులు గడువు ఇవ్వాలని రైతులు కోరారు. సమావేశంలో తహసీల్దారు కె.ప్రవల్లికప్రియ, సిబ్బంది పద్మావతి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 28 ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని నెహ్రూ యువ కేంద్రం వేదికగా బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. నిరమాన్ ఆర్గనైజేషన్, హీరో మోటో, డాయ్‌కిన్, మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థల్లో వివిధ పోస్టుల భర్తీకి జిల్లా ఉపాధి కల్పనాధికార్యాలయం ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. మొత్తం 101 మంది హాజరుకాగా, వ్యక్తిగత, మౌళిక పరీక్షల అనంతరం 28 మందిని అర్హులుగా ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇల్లు భద్రం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు యంత్రాంగం అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధిక కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దూర, ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌లో ఇంటి చిరునామా వివరాలను ముందస్తుగా నమోదు చేసుకుంటే పోలీసులు నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి గస్తీ పెంచుతారని పేర్కొన్నారు. గృహం, వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం



జ్యోతి సమస్యను కలెక్టర్‌కు విన్నవిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- జగనన్నకు చెబుదాం స్పందనలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- 103 అర్జీల స్వీకరణ

ఇచ్ఛాపురం రూరల్: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇచ్ఛాపురం ఎంపీడీఓ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలో పదుల సంఖ్యలో కిడ్నీ బాధితులు ఉన్న నేపథ్యంలో ఇచ్ఛాపురం పీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ఈదుపురం సర్పంచ్ నర్తు ప్రేమ్‌కుమార్‌లు అర్జీ సమర్పించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ యూనిట్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రత్తకన్న పరిధిలోని సర్వే నంబర్ 197లో 102 మందికి జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరు చేసినప్పటికీ స్థానిక టీడీపీ నాయకుడు కాళ్ల ధర్మారావు పనులు అడ్డుకుంటున్నారని లబ్ధిదారులు విన్నవించారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రయత్నించే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేయాలని, వీలుంటే బైండోవర్ తెరవాలని రెవెన్యూ శాఖాధికారులకు సూచించారు.

- బెంతు ఒరియాలకు ఇటీవల ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు మంజూరు చేసి నిలిపివేశారని, తమకు శాశ్వత ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని నియోజకవర్గ బెంతు ఒరియా సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు. 16 గ్రామ సచివాలయాల్లో సరిపడా సిబ్బంది లేక పాలనాపరంగా ఇబ్బందులున్నాయని ఎంపీపీ బోర పుష్ప విన్నవించారు.
- ఈదుపురం, లొద్దపుట్టి బాహుదానది పరివాహక ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్‌లు మంజూరు చేసి రైతులకు సాగునీటిని అందివ్వాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అర్జీని సమర్పించారు. మండపల్లి పంచాయతీలో విద్యుత్ సమస్యలు పరిష్కారించాలని, భీమసముద్రం గెడ్డ, మూల గెడ్డలపై వంతెన నిర్మించాలని, రైల్వే గేటు నుంచి బుద్దేపుపేట వరకు ఆర్అండ్‌బీ రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ పిట్ట మామయ్యరెడ్డి వినతిపత్రం అందించారు. మొత్తం 103 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. పలాస ఆర్డీఓ తమరాల సీతారామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్పీ రాధిక, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మీనాక్షి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, నోడల్ అధికారి టి.వాసుదేవ్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఈఓ కె.వెంకటేశ్వరరావు, డీఎల్‌డీఓ చల్లా అలివేలు మంగమ్మ, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, తహసీల్దార్ ఎస్.గురుప్రసాదరావు పాల్గొన్నారు.

బాలికకు రూ.50 వేల సాయం

ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన బదకల జ్యోతి అనే బాలిక పుట్టినప్పటి నుంచి సోరియాసిస్ వ్యాధితో బాధపడుతోంది. ప్రభుత్వం గతంలో వైఎస్సార్ పెన్షన్ కానుక మంజూరు చేసినప్పటికీ వేలిముద్రలు పడకపోవడంతో కొంత కాలంగా పింఛన్ రావడం లేదు. తండ్రి బొడ్డయ్య ఇటీవల మృతి చెందాడు. తల్లి చిలకమ్మ పేదరికంతో బాధపడుతూ 6వ తరగతి చదువుతున్న జ్యోతిని పెంచి పోషిస్తుంది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ దృష్టికి సమస్య తీసుకెళ్లారు. వెంటనే ఆయన తన నిధుల నుంచి తక్షణ సాయంగా రూ.50వేలు మంజూరు చేశారు. వచ్చే నెల నుంచి పింఛన్ అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



వినాయక విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

బైబై గణేశా..!

వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయం వద్ద పల్లకిని పుష్పాలతో అలంకరించారు. అందులో స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి 200 మంది గణపతి మాలధారణలు చేసిన వారితో ఊరేగించారు. అనంతరం మట్టి వినాయకులను నాగావళి నదిలో నిమజ్జనం చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్



నాగావళిలో గణపతిని నిమజ్జనం చేస్తూ..



నిమజ్జనానికి వేళాయె..



క్రేన్ సాయంతో



వినాయక ప్రతిమలతో చిన్నారులు

క్లుప్తంగా

అన్నదమ్ముల ఇళ్లల్లో చోరీ

- ఎనిమిదిన్నర తులాల బంగారం పట్టుకుపోయిన దుండగులు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో తాళం వేసిన రెండు ఇళ్లల్లో దొంగలు చొరబడి ఎనిమిదిన్నర తులాల బంగారాన్ని పట్టుకుపోయారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డేఅండ్‌నైట్ కూడలిలో మెడికల్ షాపు నిర్వహిస్తున్న కొచ్చిర్లపాటి ఎస్.వి.శ్రీకాంత్ వర్మ, రవివర్మ సోదరులు ఏపీహెచ్‌బీ కాలనీలో రెండు ఫ్లోర్లు ఉన్న ఇళ్లల్లో వేర్వేరుగా తమ కుటుంబాలతో నివసిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు ఇళ్లకు తాళం వేసి విజయనగరం జిల్లా రాజాం మండలం మెడకముడిదాంలో బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం పెరడు తలుపులు తీసి ఉండటాన్ని పొరుగువారు గమనించి వెంటనే అన్నదమ్ములకు ఫోన్ చేశారు. వారు హుటాహుటిన ఇంటికి వచ్చి చూసేసరికి రెండు ఇళ్లకూ తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బీరువా తాళాలను తీసి సామాన్లు చిందరవందరగా పడేసి ఎనిమిదిన్నర తులాల బంగారు వస్తువులు పోయినట్లు గుర్తించారు. దీంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్‌ఐ బి.గణేష్, క్లూస్ టీమ్ చేరుకుని విచారణ చేపట్టారు. సుమారు 34 తులాల బంగారం, వెండి వస్తువులు ఉండగా అందులో ఎనిమిదిన్నర తులాలు మాయమైనట్లు బాధితులు పోలీసులకు తెలియజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

శ్రీ వేంకటేశ్వర విద్యాసంస్థలు
ఎస్.ఎమ్.ఆర్.పురం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా
వెటర్నరీ డిప్లోమా అడ్మిషన్లు - 2023
వెటర్నరీ డిప్లోమా కోర్సు నందు ప్రవేశం కొరకు అఖరి దశ కౌన్సిలింగ్ తేదీ 26-09-2023 నుండి 30-09-2023 వరకు జరుపబడును.
కనీస అర్హత : గతంలోవున్న 10వ తరగతిలో 60% మార్కుల నుండి 35% తగ్గించడమైనది / ఇంటర్ డిస్కంటిన్యూ
పూర్తి వివరాలకు :
9390611904, 9985469033



అనన్య డిగ్రీ విద్యార్థిని. ఆండ్రాయిడ్ మొబైల్ వాడుతోంది. తన ప్రమేయం లేకుండా ఒక్కోసారి కెమెరా ఆన్ కావడం.. లోకేషన్ సెలక్ట్ కావడాన్ని గమనించింది. ఫోన్‌లో ఏదో సస్పీసియస్ యాక్టివిటీ జరుగుతోందన్న అనుమానం.. ఏం చేయాలో తెలియక.. ఎవరికి వివరించాలో పాలుపోక అంతర్మథనంలో పడింది.



మనస్విని ప్రభుత్వ ఉద్యోగిని. తన మొబైల్‌లో కొన్ని అప్లికేషన్ల థంబ్‌నిల్స్ గమనించింది. తాను డౌన్‌లోడ్ చేయకున్నా అవి మొబైల్ స్క్రీన్‌పై ఉండడం.. అన్‌ఇన్‌స్టాల్ చేసినా కాకపోవడంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో పడింది.



చందన రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. తన కుటుంబ సభ్యులతో తాను జరిపిన చాటింగ్ వివరాలను వేరే వ్యక్తి ప్రస్తావించడం గమనించింది. ఎలా సాధ్యం అని ఆలోచించింది. ఆమె ప్రశ్నకు సమాధానం కోసం వెతుకుతోంది





రక్షా కవచం

పై ముగ్గురిలానే మీ ఫోన్లలో కూడా ఇలాంటి సందేహాస్పద ప్రక్రియల్ని గమనించారా..! అయితే ఆలస్యం చేయొద్దు. మీ మొబైల్ ఫోన్‌ను పట్టుకుని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం వద్దకు వెళ్లండి. మీ మొబైల్‌ని స్కాన్ చేసి అటువంటి యాక్టివిటీకి కారణమైన వాటిని తొలగించి మీ మొబైల్‌ను భద్రంగా మీకు అందజేస్తారు. దీనికి సంబంధించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు అందుబాటులోకి తెచ్చింది 'దిశా సైబర్ కవచ్'.

- మొబైల్ ఫోన్‌కు రక్షణగా 'దిశ సైబర్ కవచ్'
- మహిళా భద్రతే ధ్యేయంగా ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ఫోన్ స్కాన్ చేసి మాల్‌వేర్ తొలగింపు
- అనుమానాస్పద యాక్టివిటీకి అడ్డుకట్ట





ఫోన్‌ను సైబర్ కవచ్‌కు అనుసంధానించి చెక్ చేస్తున్న సైబర్ ఎక్స్‌పర్ట్ శరత్ శైలా

శ్రీకాకుళం డెస్క్:

సైబర్ మోసాలు దేశవ్యాప్తంగా ఇటీవల ఎక్కువయ్యాయి. సైబర్ క్రిమినల్స్ మన మధ్యే ఉంటున్నారు. నమ్మకంగా ఉంటూ స్నేహం పేరుతో కొందరు.. ప్రేమ పేరుతో మరికొందరు.. పరిచయాల పేరు తో ఇంకొందరు మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారు. కేవలం ఐదు నిమిషాల పాటు మన మొబైల్ వారి చేతిలో ఉంటే చాలు ఇలాంటి మాల్ వేర్ ఫోన్లలోకి పంపించి వారి ఆధీనంలోకి తెచ్చుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

ఏమిటీ 'కవచ్'..

ఇటీవల కాలంలో పెరిగిన సైబర్ నేరాలు, టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ మహిళలపై వేధింపులు ఎక్కువవుతున్న నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు మహిళా భద్రతా ధ్యేయంగా దిశా సైబర్ కవచ్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళలు వాడుతున్న మొబైల్ ఎంత సేఫ్‌గా ఉంది.. లేకుంటే ఈ టెక్నాలజీ సాయంతో వాటిని సంబంధిత యాప్‌లు ఇతర వైరస్‌లను తొలగించి మహిళలకు భద్రత.. ప్రాధాన్యం ఇస్తున్నారు జిల్లా పోలీసులు.

మీ మొబైల్‌ను ఏం చేస్తారు..

- దిశ సైబర్ కవచ్ అనేది ఒక కంప్యూటర్ సాఫ్ట్‌వేర్.
- దీనితో మొబైల్‌ను కనెక్ట్ చేసేందుకు వీలుగా వీ 8, సీ పిన్‌లకు సంబంధించిన రెండు యూఎస్‌బీ కేబుళ్లు ఉంటాయి.
- మీ మొబైల్‌కు సంబంధించిన పిన్ సాయంతో కంప్యూటర్‌కు అనుసంధానిస్తారు.
- మొబైళ్లలో ఉండే యాప్‌లు, స్టోరేజీ, ఇతరాలను స్కాన్ చేస్తారు.
- అందులో ఏమైనా మాల్ వేర్ లేదా వైరస్‌లుంటే స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతాయి.
- కంప్యూటర్ గుర్తించినవి వరుస క్రమంలో అక్కడ డిస్‌ప్లే అవుతాయి.
- మీ మొబైల్‌లో ఉండే జనరల్ యాప్స్.. గేమింగ్స్ యాప్స్‌ను వేర్వేరుగా స్కాన్ చేస్తుంది.

ఉచితంగా..


దిశ సైబర్ కవచ్ ఉచితంగా వినియోగించుకోవచ్చు. శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న జిల్లా ఎస్పీ కార్యాలయం పని వేళల్లో ప్రజలు ఎవరైనా లోపలకు వచ్చి మీ మొబైల్‌ని పరీక్షించుకోవచ్చు. దీని కోసం ఓ కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా కేటాయించారు.
మరిన్ని వివరాలకు **80089 25521** ఫోన్‌లో సంప్రదించవచ్చు.

- అందులో మాలీసియస్, హైరిస్క్, లో రిస్క్, సేఫ్ విభాగాల వారీగా ఎంతెంత శాతం ఏమేం ఉన్నాయో మనకు చూపిస్తుంది.
- రిస్క్ యాప్స్ ఉంటే వాటిని వెంటనే మీ మొబైల్‌లో నుంచి సైబర్ కాప్స్ మీ ముందే తొలగిస్తారు.

అపోహలు అవసరం లేదు..



ఇది పూర్తిగా మహిళల భద్రత కోణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం. మొబైల్ స్కాన్ చేసేటప్పుడు ఫోన్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారానికి ఎలాంటి ముప్పు ఉండదు. కేవలం మాల్ వేర్‌ను మాత్రమే కంప్యూటర్ స్కాన్ చేసి ఏరివేస్తుంది. మన సమాచారాన్ని కాపీ చేయడం లాంటివి చేయరు. ఎవరైనా ఈ సేవల్ని వినియోగించుకోవచ్చు.
– జి.ఆర్.రాధిక, ఎస్పీ



- మీ మొబైల్‌లో ఎలాంటి సందేహాస్పదమైన ఆప్‌లు లేకుంటే క్లియర్ అని కంప్యూటర్ చూపిస్తుంది.

మొబైల్ ఫోన్ వాడకంలో పోలీసుల సూచనలు..

- దయచేసి మీ మొబైల్‌ను ఎవరి చేతికి ఇవ్వొద్దు.
- హై సెక్యూరిటీ పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకోండి.
- ఎప్పటికప్పుడు మీ మొబైల్‌ను అప్‌డేట్ చేయించుకోండి. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దు.
- అప్‌డేట్ చేయకుంటే సైబర్ నేరగాళ్లు మీ మొబైల్‌పై సులువుగా దాడి చేయొచ్చు.



అరసవల్లిలో 4 నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు

- రూ.35 లక్షలతో ఆలయంలో అభివృద్ధి పనులకు ఆమోదం
- తీర్మానించిన పాలకమండలి సభ్యులు

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అరసవల్లిలో అక్టోబర్ 4 నుంచి 10 వరకు ధర్మ ప్రచార వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆలయ పాలక మండలి సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో జరిగిన పాలకమండలి సభ్యుల సమావేశంలో కీలక నిర్ణయాలను ప్రకటిస్తూనే పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఆలయ కార్య నిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్, పాలక మండలి ఎక్స్ అఫీషియో మెంబర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధ,



సమావేశంలో చర్చిస్తున్న పాలకమండలి సభ్యులు

లుకలాపు గోవిందరావు, జలగడుగుల శ్రీనివాస్, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలివే..

- ఆలయ రాజగోపురం ఆధునీకరణ, ఇంద్రపుష్కరిణి అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించడం.
- ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం మొత్తం 18 పనులకు దేవదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు తగిన ఎస్టిమేట్లు తయారు చేసిన క్రమంలో రూ.35 లక్షలతో పనులు చేపట్టేందుకు ఆమోదం.
- ఉచిత దర్శన క్యూ కాంప్లెక్స్ పైఅంతస్తులో ఇంజినీరింగ్ ప్లానింగ్ అనుమతులతో అదనంగా 10 వసతి గదులను దాతలే స్వయంగా నిర్మించుకుని ఆలయానికి సమర్పించేలా నిర్ణయాలకు ఆమోదం.
- అరసవల్లి ఆలయానికి దక్షిణాన ఉన్న బ్రాహ్మణవీధిలో లేటు దూసి రామచంద్ర రావు కుమారుడు దూసి ప్రవీణ్‌కు చెందిన 13.63 సెంట్ల భూమిని ఆలయ అవసరాలకు గాను విక్రయించేందుకు జరిగిన ఒప్పందంపై కొనుగోలుకు ఆలయ నిధులు వినియోగించడం.
- ఆలయంలో దినసరి వేతనదారుల్లో సక్రమంగా విధులకు హాజరుకాని సిబ్బందిపై వేటు వేసేలా తీర్మానించారు.

కొబ్బరిలో 99 శాతం ఈ-క్రాప్ పూర్తి



వ్యవసాయ క్షేత్రంలో పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రసాద్

కవిటి: పథకాల లబ్ధికి ఈ–క్రాప్ తప్పనిసరని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి.ప్రసాద్ అన్నారు. చండిపురం రైతుభరోసా కేంద్రం పరిధిలోని భూముల్లో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ–క్రాప్ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. రైతులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత, సచివాలయ సహాయకుడు నెయ్యిల గణపతి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

పాతపట్నం: తండ్రి మద్యానికి బానిస కావడం, ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురై ఇంటర్మీడియెట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం మేజర్ పంచాయతీ జోగేశ్వర వీధికి చెందిన గుమ్మడి శ్యామల అలియాస్ శ్రావణి(16) పాతపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి గుమ్మడి శ్రీను ట్రాలీరిక్షా నడుపుతూ, తల్లి లక్ష్మి కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తండ్రి మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచు గొడవలు జరిగేవి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో శ్రావణి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి మధ్యాహ్నం వచ్చి చూసేసరికి కుమార్తె తాడుకు వేలాడుతుండటంతో స్థానికుల సాయంతో ఆటోలో పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే శ్రావణి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రావణి రాసిన సూసైడ్ నోట్‌ను గుర్తించారు. తన మృతికి ఎవరూ కారకులు కాదని, తల్లిదండ్రులు తరచు గొడవ పడుతుండటంతో మనస్తాపం చెంది మరణిస్తున్నానంటూ నోట్‌లో పేర్కొంది. పోస్టుమార్టం అనంతరం కుమార్తె మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



ఆస్పత్రిలో శ్రావణి మృతదేహం

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



గాయపడిన రవికుమార్

టెక్కలి రూరల్: స్థానిక సుదర్శన్ కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేటకు చెందిన పందిరి రవికుమార్‌కు గాయాలయ్యాయి. టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రవికుమార్ పలాసలో పెయింటింగ్ పని పూర్తి చేసుకుని మంగళవారం అర్ధరాత్రి తన ద్విచక్ర వాహనంపై టెక్కలి వస్తుండగా సుదర్శన్ థియేటర్ జంక్షన్ వద్ద రహదారిపై స్పీడ్ బ్రేకర్ గమనించక అతివేగంగా వెళ్లాడు. వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన టెక్కలి పోలీసులు గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై బుధవారం టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొట్టడంతో..

పోలాకి: మండలంలో కింజరాపువానిపేట వద్ద పోలాకి–నరసన్నపేట రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సెబ్(ఎక్సైజ్)కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జె.మోహనరావు పోలాకి నుంచి నరసన్నపేట వైపు బైక్‌పై వెళ్తున్న సమయంలో బొరిగివలసకు చెందిన తాపీమేస్త్రీ బొంగు గోపాల్‌కు లిఫ్ట్ ఇచ్చారు. ఇద్దరూ కలిసి వెళ్తున్న సమయంలో ఎదురుగా వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో కిందపడ్డారు. వెంటనే క్షతగాత్రులను 108లో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. పోలాకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ కులగణన చరిత్రాత్మకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):


దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా బీసీ కులగణన చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడం చరిత్రాత్మకమని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. బీసీ కులగణనకు ఆరుగురు ఐఏఎస్ అధికారులతో అధ్యయన కమిటీ వేయడం హర్షణీయమన్నారు. శ్రీకాకుళం నగరంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఆరోగ్య ఫలాలు అందించేందుకు బీసీ కులగణన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వందేళ్ల చరిత్రలో ఏపీలో ఇప్పటివరకు కులగణన చేసేందుకు ఏ ప్రభుత్వం ముందడుగు వేయలేదన్నారు. దీనికి బట్టి బీసీల పట్ల సీఎం జగన్‌కున్న అభిమానం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుందన్నారు.

శాసనసభలో బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అధ్యయన కమిటీ బిల్లును ప్రవేశపెట్టడం బీసీ జాతికే గర్వకారణమన్నారు. కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు బీసీ గర్జనలో చెప్పినట్లుగా బీసీలంటే వెనుకబడిన కులాలు కాదు దేశానికే బ్యాక్‌బోన్ అని గుర్తు చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేని తనంతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ మాట్లాడుతూ సాహసోపేత నిర్ణయం తీసుకున్న జగనన్నకు బీసీలంతా రుణపడి ఉంటారని పేర్కొన్నారు. సమావేశంలో పొందర, కురాకుల కార్పొరేషన్ చైర్మన్ ప్రతినిధి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ దేవ్‌ను సన్మానిస్తున్న కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు

కులగణన నిర్ణయం భేష్



పేరాడ తిలక్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న ప్రతి నిర్ణయం చరిత్రాత్మకమని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రతీ పది సంవత్సరాలకు ఒక సారి జనాభా లెక్కలను మాత్రమే లెక్కిస్తున్నారు తప్ప ఏ ఒక్క ముఖ్యమంత్రి కులగణనపై దృష్టి సారించలేదన్నారు. కులగణన పూర్తి స్థాయిలో నిర్వహిస్తే వెనుకబడిన వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఇతర సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందుతాయని పేర్కొన్నారు. చరిత్రాత్మక నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు.

Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ ఆఫీస్, హెచ్. నెం.8, సింహ ద్వారం ఆర్చ్ దగ్గర, వెంకటాపురం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్ : 08942-270919, 270944

ఇ-వేలం అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకం కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూల్ 8(6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకమునకు ఋణగ్రహీత/లు మరియు హామీదారు/లు తెలియజేయునది ఏమనగా ఈ క్రింద తెలియజేయబడిన స్థిరాస్తులు బ్యాంకునకు తనఖా వుంచి పొందిన ఋణము తిరిగి చెల్లించుటలో విఫలమైనందున యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి వారు బకాయి సొమ్మును ఋణగ్రహీత/లు మరియు హామీదారు/లు నుండి తిరిగి రాబట్టుకునేందుకు సదరు ఆస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది అలాగే" "అక్కడ ఏమి ఉన్నది అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" అనే పద్ధతిపై దిగువ తెలిపిన బకాయి సొమ్ములను మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలను రాబట్టుకొనుటకు ఋణదాత అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు తేది.13.10.2023 న సదరు ఆస్తులను ఇ-వేలం ద్వారా అమ్మకం చేయుదురని తెలియజేస్తూ ఈ నోటీసు జారీ చేయబడినది.

1) గంగువారి సిగడం బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా — ఫోన్ నెం.08941-255128

ఋణగ్రహీతలు : యూనిట్ నెం.1) మెస్సర్స్ రాజ్యలక్ష్మి క్రషర్స్, ప్రొప్రయిటర్ : శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, యూనిట్ చిరునామా : సర్వే నెం.298-21, మెయిన్ రోడ్డు, పొందూరు గ్రామం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168. ప్రొప్రయిటరు : శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, భర్త. వెంకట రమణ మూర్తి, డి నెం.1-15, రాజాం నుండి చిలకపాలెం రోడ్డు, పొందూరు గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168. సహ-హామీదారు : శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి, తండ్రి. నారాయణ మూర్తి, డి నెం.1-15, రాజాం నుండి చిలకపాలెం రోడ్డు, పొందూరు గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168. యూనిట్ నెం.2) మెస్సర్స్ శ్రీ ఎమ్ పి బాలాజీ స్టోన్ క్రషర్స్, ప్రొప్రయిటర్ : శ్రీ పి. వెంకట రమణ మూర్తి, యూనిట్ చిరునామా : సర్వే నెం.299-8, మెయిన్ రోడ్డు, పొందూరు గ్రామం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168. ప్రొప్రయిటరు : శ్రీ పప్పల వెంకట రమణ మూర్తి, తండ్రి. నారాయణ మూర్తి, డి నెం.1-15, మెయిన్ రోడ్డు, పొందూరు గ్రామం & మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168. సహ-హామీదారు : శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, భర్త. వెంకట రమణ మూర్తి, డి నెం.1-15, రాజాం నుండి చిలకపాలెం రోడ్డు, పొందూరు గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168. యూనిట్ నెం.3) మెస్సర్స్ శ్రీ విజయ దుర్గ రా మెటీరియల్ సప్లయర్, ప్రొప్రయిటర్ : శ్రీమతి సీపాన స్వాతి, యూనిట్ చిరునామా : సర్వే నెం.27-1, మెయిన్ రోడ్డు, పొందూరు గ్రామం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168. ప్రొప్రయిటరు : శ్రీమతి సీపాన స్వాతి, మెయిన్ రోడ్డు, బాలాజీ థియేటర్ ప్రక్కన, పొందూరు గ్రామం & మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168. సహ-హామీదారు : శ్రీమతి పప్పల రాజ్యలక్ష్మి, భర్త. వెంకట రమణ మూర్తి, డి నెం.1-15, రాజాం నుండి చిలకపాలెం రోడ్డు, పొందూరు గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532168.
బకాయి మొత్తం : తేది.13.09.2023 నాటికి రూ.1,32,20,853.01 పై (అక్షరాల ఒక కోటి ముప్పై రెండు లక్షల ఇరవై వేల ఎనిమిది వందల యాభై మూడు రూపాయల ఒక పైసా మాత్రమే) తదుపరి వడ్డీ, కాస్ట్లు & ఖర్చులతో సహా కలిపి చెల్లించవలెను.
స్థిరాస్తి వివరములు : శ్రీకాకుళం జిల్లా, పొందూరు గ్రామం, రాజాం నుండి చిలకపాలెం రోడ్డు, బాలాజీ థియేటర్ మరియు పాత ఎస్.బి.ఐ బ్రాంచ్ దగ్గరలో, డోర్ నెం.1-15, సర్వే నెం.203 వద్ద గల 2771.58 చ॥గ॥లు విస్తీర్ణంలోని కమర్షియల్ ఖాళీ స్థలం. హద్దులు : ఉత్తరం : బండ్ల దారి, దక్షిణం : పొట్నూరు శ్రీనివాస రావు యొక్క స్థలం, తూర్పు : టేకి నాగరాజు యొక్క గోడౌన్, పడమర : బిట్టివలస జూట్ మిల్స్ యొక్క స్థలం.
రిజర్వు ధర : రూ.1,27,80,000/- ధరావత్తు : రూ.12,78,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.1,30,000/-

2) బలగ బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా — ఫోన్ నెం.08942-225855

దరఖాస్తుదారు : శ్రీ బూర్ల వెంకట కృష్ణ మూర్తి, తండ్రి. పార్వతీశం లేటు, ఫ్లాట్ నెం.210, హనుమాన్ ఎన్‌క్లేవ్, ఎల్.బి.ఎస్ కాలనీ, గ్రైనేటి వీధి, శ్రీకాకుళం-532001 మరియు : ఇ.నెం.9-5-39, గుడి వీధి, శ్రీకాకుళం, ఆం.ప్ర-532001. సహ-దరఖాస్తుదారు : శ్రీమతి బూర్ల వెంకట సత్య లక్ష్మి, భర్త. వెంకట కృష్ణ మూర్తి, ఫ్లాట్ నెం.210, హనుమాన్ ఎన్‌క్లేవ్, ఎల్.బి.ఎస్ కాలనీ, గ్రైనేటి వీధి, శ్రీకాకుళం-532001 మరియు : ఇ.నెం.9-5-39, గుడి వీధి, శ్రీకాకుళం, ఆం.ప్ర-532001.
బకాయి మొత్తం : తేది.15.09.2023 నాటికి రూ.35,17,845.49 పై (అక్షరాల ముప్పై ఐదు లక్షల పదిహేడు వేల ఎనిమిది వందల నలభై ఐదు రూపాయల నలభై తొమ్మిది పైసలు మాత్రమే) తదుపరి వడ్డీ, కాస్ట్లు & ఖర్చులతో సహా కలిపి చెల్లించవలెను.
స్థిరాస్తి వివరములు : శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ యొక్క అధికార పరిధిలోని, గ్రైనేటి వీధి యొక్క వెనుక వైపున, ఎల్.బి.ఎస్.కాలనీ లే-అవుట్ యొక్క ఉత్తరం వైపున వద్ద గల ఆర్.ఎస్.నెం.204, టి.ఎస్.నెం.181 భాగం ప్రకారం ఎస్ సి నెం. 131101ఎ104058831, అసెస్మెంట్ నెం.1088502 5740, డోర్ నెం.12-14-5 దగ్గర మొత్తం 2651 చ॥గ॥లు లేదా 2216.34 చ॥మీ॥లు విస్తీర్ణంలోని 42.113 చ॥గ॥లు లేదా 35.21 చ॥మీ॥లు అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో గల స్థలం నందు హనుమాన్ ఎన్‌క్లేవ్ యొక్క భవనం స్టిల్ట్, గ్రౌండ్ + నాలుగు అంతస్తులు గల ప్లింత్ ఏరియా 950 చ॥అ॥లు విస్తీర్ణంలోని నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.504 నిర్మించబడి ఉన్నది మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లోని 100 చ॥అ॥లు కార్ పార్కింగ్ (కామన్ ఏరియాలతో కలిపి) తో కలదు. మొత్తం ఆస్తి హద్దులు : తూర్పు : పద్మావతి నగర్ కాలనీ, దక్షిణం : 33 అ॥ల వెడల్పు మున్సిపల్ రోడ్డు, పడమర : శ్రీ గ్రైనేడి భీమ రావుకు చెందిన లే-అవుట్ ప్లాట్లు, ఉత్తరం : హనుమంతు సునీత మరియు కణితి అనిల్ కుమార్ గార్ల స్థలం. నాల్గవ అంతస్తులోని ఫ్లాట్ నెం.504 నకు హద్దులు : తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : ఫ్లాట్ నెం.503, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై
రిజర్వు ధర : రూ.20,10,000/- ధరావత్తు : రూ.2,01,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.21,000/-

3) రాజాపురం బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా — ఫోన్ నెం.08947-236137

ఋణగ్రహీతలు : 1) శ్రీ ఈగల బాలకృష్ణ, తండ్రి. ఈగల నారాయుడు, 2వ లేన్, సహలాలపుట్టుగ, సవాసనపుట్టుగ, కవిటి మండలం-532322, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర. 2) శ్రీ లంద చంద్రమణి, తండ్రి. ఎల్. జగన్నాయకులు లేటు, ఎస్.ఆర్.సి. పురం, ఎమ్.ఆర్.ఓ ఆఫీస్ పోస్ట్ / మండలం దగ్గర, కంచిలి, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532290.
బకాయి మొత్తం : తేది.31.08.2023 నాటికి రూ.4,26,052.83 పై (అక్షరాల నాలుగు లక్షల ఇరవై ఆరు వేల యాభై రెండు రూపాయల ఎనభై మూడు పైసలు మాత్రమే) తదుపరి వడ్డీ, కాస్ట్లు & ఖర్చులతో సహా కలిపి చెల్లించవలెను.
స్థిరాస్తి వివరములు : శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, లండరిపుట్టుగ పంచాయితీ, సవాసనపుట్టుగ రెవెన్యూ, సిలగాం మధుర, ఓవర్ సర్వే నెం.202/3ఎ (202/3) వద్ద గల 128.88 చ॥గ॥లు విస్తీర్ణంలోని నివాసయోగ్యమైన భూమి మరియు భవనం శ్రీ ఈగల బాలకృష్ణ, తండ్రి. ఇ. నారాయుడు గారి పేరున ఉన్నది. హద్దులు : ఉత్తరం : ఈగల నారాయుడు గారి స్థలం, దక్షిణం : రోడ్డు, తూర్పు : ఈగల నారాయుడు గారి స్థలం, పడమర : నర్తు లచ్చయ్య గారి స్థలం.
రిజర్వు ధర : రూ.4,70,000/- ధరావత్తు : రూ.47,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-

4) ఋణగ్రహీతలు : 1) శ్రీ కర్రి అశోక్ కుమార్, తండ్రి. కర్రి పూర్ణ వాసులు, డోర్ నెం.15-13, కర్రిపుట్టుగ గ్రామం, మడియారిపుట్టుగ, సహలాల పుట్టుగ, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా-532290. 2) శ్రీ కర్రి పూర్ణ వాసులు, తండ్రి. కర్రి కామయ్య, డోర్ నెం.15-13, కర్రిపుట్టుగ గ్రామం, మడియారిపుట్టుగ, సహలాల పుట్టుగ, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా-532290. 3) శ్రీ కర్రి తుంబయ్య, తండ్రి. కర్రి కామయ్య, డోర్ నెం.15-13, కర్రిపుట్టుగ గ్రామం, మడియారిపుట్టుగ, సహలాల పుట్టుగ, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా-532290.
బకాయి మొత్తం : తేది.31.08.2023 నాటికి రూ.13,93,143.17 పై (అక్షరాల పదమూడు లక్షల తొంభై మూడు వేల నూట నలభై మూడు రూపాయల పదిహేడు పైసలు మాత్రమే) తదుపరి వడ్డీ, కాస్ట్లు & ఖర్చులతో సహా కలిపి చెల్లించవలెను.
స్థిరాస్తి వివరములు : శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, సాలిగం, రెవెన్యూ గ్రామం, సహలాల పుట్టుగ పంచాయితీ, మడియారిపుట్టుగ గ్రామం, డోర్ నెం.15-13 దగ్గర, సర్వే నెం.483/1లోని 166.66 చ॥గ॥లు విస్తీర్ణంలోని నివాసయోగ్యమైన భూమి మరియు భవనం శ్రీ కర్రి అశోక్ కుమార్ గారికి చెందినది. హద్దులు : తూర్పు : కర్రి తుంబయ్య గారి కొబ్బరి తోట, దక్షిణం : కర్రి తుంబయ్య గారి కొబ్బరి తోట, పడమర : కర్రి పూర్ణవాసులు గారి స్థలం, ఉత్తరం : రోడ్డు.
రిజర్వు ధర : రూ.16,40,000/- ధరావత్తు : రూ.1,64,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.20,000/-

బ్యాంకు వారికి తెలిసిన తాకట్టు ఋణభారములు : లేవు
ఇ-వేలం తేది మరియు సమయం : 13.10.2023, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ వరకు (వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)
ఆస్తుల విక్రయమునకు సంబంధించిన పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు, దయచేసి https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp మరియు వెబ్‌సైట్ www.unionbankofindia.co.in నందు చూడగలరు.
తేది : 27.09.2023
స్థలం : శ్రీకాకుళం
సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, శ్రీకాకుళం

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
■ SUDA లే అవుట్, పైడి భీమవరం జం॥ NH ఫేసింగ్, కమర్షియల్ & రెసిడెన్సియల్ ప్లాట్స్ అమ్మకం. 40 ఫీట్ రోడ్స్, స్పాట్ రిజిస్ట్రేషన్, లోన్ సౌకర్యం కలదు. ఫోన్: 98851 28080 [V-2152]

WANTED
■ IRPM కంపెనీ శ్రీకాకుళంలో నూతనంగా ప్రారంభించిన బ్రాంచ్‌లో BMMT లో పనిచేయుటకు 10th /ఇంటర్ గల 50 మంది యువతీ యువకులు కావలెను. Income: 12 వేలు-22వేలు. సెల్: 9849553548. [WA-7227]
■ ప్రముఖ సంస్థ నందు HYDలో పనిచేయుటకు స్త్రీ/పు కావలెను. విద్యార్హత: 7th/Degree. Pass/Fail. వ: 18–30 సం॥ లోపు. జీతం: 13 వేలు నుండి 30 వేలు +కమీషన్ ఇవ్వబడును. ఫోన్: 86398 98452, 83419 42227 [V-2149]
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221646]
■ "జాబ్ గ్యారెంటీ" మా కంపెనీ కొరకు మహిళలు /పురుషులు అర్జెంటుగా కావలెను. జీతం: 20,000/-వరకు, ఫ్రీ రూం+భోజనం, మ్యాన్ పవర్ ఏజెంట్స్ కావలెను.(5 వేల వరకు కమీషన్) 9866310431. [H-793351]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9160900024 [HA-657]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.